క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందిస్తున్న టీఆర్‌వీకేఎస్ నాయకులు

పాల్వంచ: హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేశ్, అడిషనల్ సెక్రటరీ నిరంజన్, ఎస్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎండీ యూసఫ్, ట్రాన్స్‌కో అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనకయ్యకు సన్మానం



ఎమ్మెల్యే కనకయ్యను సన్మానిస్తున్న కార్యదర్శులు

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచిన కోరం కనకయ్యను టేకులపల్లి మండలానికి చెందిన కార్యదర్శులు సన్మానించారు. ఈ మేరకు గురువారం కోయగూడెంలో ఎమ్మెల్యేని కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు జేపీఎస్ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వానికి వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి జక్కుల గణేష్ గాంధీ, కార్యదర్శులు గోపాలకృష్ణ, సందీప్, సంజీవ్, కిరణ్, వసంతరావు, రాములు, వరుణ్, అజయ్, చిట్టి సిద్ధాంతి, కవిత, శ్వేత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి దర్గా ఉర్సు వేడుకలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

టేకులపల్లి: కులమతాలకు అతీతంగా ప్రతి సంవత్సరం జరిగే బేతంపూడిలోని హజరత్ సయ్యద్ జమాలుద్దీన్ బీహారీ బాబా దర్గా ఉర్సు వేడుకలు ఈనెల 8 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉర్సు వేడుకల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే షఫీ, ఎస్‌కే జానీ తెలిపారు. ఈ మేరకు గురువారం దర్గా ఆవరణలో వేడుకల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యుడు దూస జనార్దన్ డైరీని టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం న్యాయవాదులకు ఉపయోగపడే కోర్టు డైరీని అందించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాశ్, సత్యనారాయణ, కార్తీక్, ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

టేకులపల్లి: ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులు తమ కుల ధ్రువీకరణ పత్రాలు విద్యుత్ శాఖ కార్యాలయంలో అందజేయాలని టేకులపల్లి, బొమ్మనపల్లి విద్యుత్ శాఖల ఏఈలు దేవా, బుజ్జి కన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు సకాలంలో ఇవ్వకుంటే ప్రభుత్వం ఇచ్చే 0 –101 విద్యుత్ యూనిట్లకు విద్యుత్ బిల్లులో సబ్సిడీ రాదని పేర్కొన్నారు.

మొక్కల పెంపకానికి సన్నద్ధం

- నర్సరీల్లో చురుగ్గా జరుగుతున్న పనులు
- 18 గ్రామ పంచాయతీల్లో మొక్కల పెంపకం
- వచ్చే హరితహారంలో నాటేందుకు ప్రణాళిక



రుద్రంపూర్‌లో నర్సరీ పనులను పరిశీలిస్తున్న ఉద్యోగులు

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం హరితహారంలో భాగంగా ప్రతి ఏడాది విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనానికి పెద్దపీట వేస్తూ వస్తోంది. దీని ద్వారా అడవుల అభివృద్ధిలో మరిన్ని ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రతి ఏడాది హరిత నర్సరీల ద్వారా మొక్కలను పెంచే ప్రక్రియను చేపడుతున్నారు. ఏప్పటిలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్)లో గ్రామానికొకటి చొప్పున ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చుంచుపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో డీఆర్డీఏ ఆధ్వర్యంలో హరిత నర్సరీలలో మొక్కలను పెంచనున్నారు. వీటి బాగోగులను గ్రామ పంచాయతీలు చూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం గ్రామాల్లో హరిత నర్సరీలకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొన్ని నర్సరీల్లో పనులు ఆరంభంలో ఉండగా మరికొన్ని నర్సరీల్లో ఇప్పటికే సంచుల్లో మట్టిని నింపే పనులు సైతం మొదలు పెట్టారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీ పరిధిలో ఐదుగురు ఉపాధి కూలీలు ఈ నర్సరీ పనులు చూస్తున్నారు. ప్రతీ నర్సరీలో 20 వేలకు తగ్గకుండా మొక్కలను పెంచనున్నారు. డీఆర్డీఏ, అటవీశాఖలు సంయుక్తంగా హరిత నర్సరీల్లో మొక్కల పెంపకం పనులను పర్యవేక్షిస్తాయి. మొదట బ్యాగుల్లో మట్టిని నింపిన తరువాత విత్తనాలు పెట్టే పనులు చేపడతారు. డీఆర్డీఏ ద్వారా గ్రామ పంచాయతీల్లో ఈ హరిత నర్సరీలకు విత్తనాలు అందజేస్తారు. నర్సరీల్లో మొత్తం 40 రకాల మొక్కలను పెంచుతారు. వాటిలో మందార, రోజా, బాహునియా, తబుబియా, సీతాఫలం, కరివేపాకు, టేకొమా, జామా, దానిమ్మ, గన్నేరు, మునగ, రెడ్ సాండర్స్, బాంబో, గుల్‌మోహర్, కానుగ, వేప, అల్‌బిజియా, బూరుగు, చింత, చిన్నబాదం, బాదం, రెయిన్‌ట్రీ, ఈత, మారెడు, సీమ తంగెడు, జీడీ, జమ్మి, అల్లనేరెడు, ఉసిరి ఇతర రకం మొక్కలు పెంచుతారు. ప్రతీ హరితహారంలో రైతులు ఎక్కువగా టేకు మొక్కలపై ఆసక్తి చూపటంతో నర్సరీల్లో వాటిని కూడా అధిక సంఖ్యలో పెంచటానికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఈ నర్సరీల్లో పెంచిన మొక్కలనే వచ్చే ఏడాది జూలైలో ప్రభుత్వం చేపట్టనున్న హరితహారంలో ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, చెరువు కట్టలు,



రామాంజనేయకాలనీలో నర్సరీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సరిత, ఉపాధి సిబ్బంది

రైతుల పొలాల గట్ల మీద, రోడ్ల వెంబడి, కమ్యూనిటీ సెంటర్లు, పాఠశాలలు, కళాశాలలు, తదితర ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటుతారు.

మొక్కల పెంపకానికి ఏర్పాట్లు



అధికారుల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల పరిధిలో హరిత నర్సరీలను సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం నర్సరీల్లో మట్టి తోలకాలు, సంచుల్లో మట్టి నింపడం వంటి పనులు చేస్తున్నాం. దీని కోసం గ్రామం పరిధిలో ఉన్న ఉపాధి కూలీలను వినియోగిస్తున్నాం. ఈ మట్టి నింపే పనుల తరువాత సంచుల్లో విత్తనాలు పెడతాం.

– బి.బాబూరావు, సెక్రటరీ, విద్యానగర్

చురుగ్గా నర్సరీల పనులు



డీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో మొక్కలు పెంచేందుకు హరిత నర్సరీని ఏర్పాటు చేశాం. మండలంలో మొత్తం 18 చోట్ల మొక్కలు పెంచేలా చర్యలు చేపట్టాం. ఈ సారి ముందుగానే నర్సరీ పనులను ప్రారంభించాం. ప్రస్తుతం నర్సరీల్లో సంచుల్లో మట్టిని నింపే పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

– గుంటి.సత్యనారాయణ, ఎంపీఓ, చుంచుపల్లి

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓ వెంకట్

జూలూరుపాడు: జూలూరుపాడు పెండ్యా భాగ్యమ్మ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ గుగులోత్ వెంకట్ ఆకస్మికంగా చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్లు, ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను ఎంఈఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)లో భాగంగా ఉపాధ్యాయులు వర్క్ షీట్లు కరక్షన్ చేస్తున్నారా? లేదా వీక్లీ అసెస్మెంట్, నెలవారీ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. లైబ్రరీలోని పుస్తకాలను ఉపాధ్యాయులు వాడుతున్నారా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయ బృందం డి.భాస్కర్, సీతారాములు, స్వర్ణ, విజయలక్ష్మి, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన...

సాయిరాంతండా, గుండెపుడి, రామచంద్రాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను జూలూరుపాడు కాంప్లెక్స్ హెచ్‌ఎం టి.లక్ష్మీనర్సయ్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, రిజిస్టర్లతోపాటు, ఎఫ్ఎల్ఎన్ అమలు తీరుతెన్నులను పరిశీలించారు.

నేడు గ్రామసభలు

సుజాతనగర్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా శుక్రవారం నాయకులగూడెం, కొత్త అంజనాపురం, నర్సింహాసాగర్ గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని మండల అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం, విజయలక్ష్మీనగర్ గ్రాపమంచాయతీలలో ప్రజాపాలన గ్రామసభలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలరాజు గురువారం తెలిపారు. అదేవిధంగా సుదిమళ్ల, బొజ్జాయిగూడెం, చల్లసముద్రం, కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన దరఖాస్తులను శుక్రవారం కూడా స్వీకరిస్తామని చెప్పారు.

టేకులపల్లి: మండలంలో శుక్రవారం దాసుతండా, టేకులపల్లి, సులానగర్, తడికలపూడి, కొప్పురాయి, బోడు గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామ సభలు ఉంటాయని ఎంపీడీఓ కోట వీరబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.5,485 కోట్ల డైట్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. పాఠశాలలు, గురుకులాలు, ఇతర విద్యాసంస్థలకు బిల్లులు సకాలంలో చెల్లించని కారణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించలేక పోతునట్లు చెప్పారు. అప్పులు తెచ్చి భోజనం పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుళ్లి సకాలంలో బిల్లులను విడుదల చేయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, గరల్స్ కన్వీనర్ భవ్యశ్రీ, నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు: ప్రమాదంలో గాయపడి అనారోగ్యం పాలైన ఓ ఎలక్ట్రీషియన్‌కు ఇల్లెందు ఆటో నగర్‌కు చెందిన తోటి ఎలక్ట్రీషియన్లు ఆర్థిక సాయం అందించారు. గురువారం ఇల్లెందులో ప్రమాదంలో గాయపడిన షఫీకి అసోసియేషన్ అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

14 నంబర్ బస్తీలో...

పట్టణంలోని 14 నంబర్ బస్తీ నివాసి సంతోష్ కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఇంటికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి గురువారం సంతోష్ ఇంటికి వెళ్లి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కొత్వాల

పాల్వంచ: క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక ధృడత్వానికి ఎంతో ఉపయోగపడతాయని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచలో బొందిలి హరి జ్ఞాపకార్థం బొందిలి హరి మెమోరియల్ క్రికెట్ కప్ సీజన్ రాష్ట్ర స్థాయి పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, కాంపెల్లి కనకేశ్, మధు, చింతా నాగరాజు, నిర్వాహకులు ఫరీద్, నాగసత్యం, మణికంఠ, సంతోశ్, ఆర్‌కే.రాము, భరత్, శాంతి వర్ధన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రెయిలీ జీవితం యువతకు ఆదర్శం



బ్రెయిలీకి నివాళి అర్పిస్తున్న దివ్యాంగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లూయిస్ బ్రెయిలీ జీవితం నేటి యువతకు ఆదర్శమని టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ అన్నారు. సంఘ కార్యాలయంలో గురువారం అంధుల లిపి నిర్మాత లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు అంధులు సైతం ఐఏఎస్, సుప్రీంకోర్టు జడ్జి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా అత్యున్నత స్థాయికి చేరడం బ్రెయిలీ కృషి ఫలితమేనని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో కాటి నాగేశ్వరరావు, సున్నం కరుణాకర్, చాంద్‌పాషా, ఖాశీం, శైలజ, కళాబాబురెడ్డి, గట్ల రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గురువులకు పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న ఫాదర్‌లు

పాల్వంచ: పట్టణంలోని ప్రముఖ ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో జీసస్ పార్క్‌లో ఏడుగురు నూతన గురువులకు పట్టాభిషేక కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఫాదర్‌లు కాంపెల్లి జోసెఫ్, ఇంటూరి సునీల్, చాపల మడుగు లూకాస్, నందిగామ జోసఫ్ మరియా, వీరపోగు జ్వన్నిస్, చౌటుపల్లి మనోజ్, బళ్లారపు సుభాష్‌లా ఉరు పట్టాభిషేకం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక వాక్యోపదేశం, ప్రార్థనలు, గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈ పట్టాభిషేక కార్యక్రమంలో పాల్వంచ ఓసీడీ జయరాజు, ఖమ్మం, కొత్తగూడెం పీఠాధిపతులు, ఫాదర్‌లు, సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం



కోయగూడెంలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: ప్రజలకు సుపరిపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోయగూడెం, బద్దుతండా (తుమ్మలచెలక) పంచాయతీల్లో ఏర్పాటు చేసిన గ్రామ సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎవరూ అధైర్యపవద్దన్నారు. ప్రజాపాలనతో క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజారిటీతో తనను గెలిపించి మరింత బాధ్యత పెంచారని ప్రజలకు రుణపడి ఉంటానని, రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సంక్షేమం కోసం పని చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజా శ్రేయస్సు కోరే పార్టీ అని నాడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఉచిత వైద్యం అందజేసి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని గుర్తుచేశారు. అదేవిధంగా ఆరు గ్యారెంటీల దరఖాస్తులు అధికారులతో కలసి స్వీకరించారు. మండలంలో జరిగిన గ్రామసభల్లో ఎంపీపీ భూక్యా రాధ, పూనెం ఉమ, జాల సంధ్య, ఎంపీడీఓ కోట వీరబాబు, తహసీల్దార్ కృష్ణవేణి, గణేష్‌గాంధీ, ముత్తయ్య, నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

సుజాతనగర్: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు అన్నారు. రాఘవాపురంలో జరుగుతున్న ప్రజాపాలన సదస్సును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించారు. మాట్లాడుతూ... అర్హుల నుంచి 6వ తేదీ వరకు జరిగే గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. గ్రామసభలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామసభల నిర్వహణ సమాచారం, దరఖాస్తును ప్రతీ కుటుంబానికి అందజేయాలని సూచించారు. కాగా గురువారం సుజాతనగర్‌లో 163, నాయకులగూడెంలో 623, రాఘవాపురంలో 441 మొత్తం 1,227 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



బహుమతులు అందజేస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ప్లాస్టిక్ వినియోగం భవిష్యత్ తరాలకు శాపం.. పర్యావరణానికి తీవ్ర విఘాతం.. చిన్నతనం నుంచే ప్లాస్టిక్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరచారి, రాష్ట్ర నేషనల్ గ్రీన్ కోర్స్ ప్రాజెక్టు ఆఫీసర్ టి.రాధిక అన్నారు. గురువారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జిల్లా స్థాయి నాటిక, ఏకపాత్రాభినయం పోటీలు జరిగాయి. ముగింపు కార్యక్రమానికి హాజరైన వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాట్లాడుతూ.... ఇలాంటి నాటికల ద్వారా బాలబాలికలు ఎవరి పాఠశాలలో వారు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, ఆ తరువాత చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్‌జీసీ, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాల్‌మెంట్, ఫారెస్టు అండ్ క్లెమైట్ చేంజ్ – గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రజల్లో ప్లాస్టిక్ వినియోగం ద్వారా కలిగు నష్టాలను వివరించడానికి ఇలాంటి నాటికలు ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఎన్‌జీసీ నిధులు విడుదల కాబోతున్నాయని, అన్ని పాఠశాలలు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు, న్యాయనిర్ణేతలు వి.కోండల్‌రావు, పి.సత్యనారాయణ, ఎస్.రాజు, ఏ.కరుణ, ఎన్‌జిసి కోఆర్డినేటర్ ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పూర్వవైభవానికి కృషి చేయండి



సీఎండీకి శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు పూర్వవైభవం తీసుకొచ్చేలా సీఎండీ బలరామ్ కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఇటీవల సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన బలరామ్‌ను హైదరాబాద్‌లో గురువారం ఐఎన్‌టీయూసీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేరు మార్పిడి, డిపెండెంట్ల పిల్లలకు దివ్యాంగుల కోటాలో ఉద్యోగాలు, వీకే –7ఓసీ అనుమతుల సాధనపై దృష్టి సారించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, నాయకులు త్యాగరాజు, నర్సింహారెడ్డి, ఆల్బర్ట్ పాల్గొన్నారు. అలాగే కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సెంట్రల్ వర్క్‌షాపుకు పూర్వవైభవం కల్పించి, కార్మికులు, ఉద్యోగుల సంఖ్య పెంచేలా కృషి చేయాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్పొరేట్ వైస్ ప్రసిడెంట్ చేనెల్లి మురళీ కోరారు. ఈ మేరకు ఆయన సీఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకునూరి కనకరాజు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తదితరులు కూడా సీఎండీ బలరామ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా కాంగ్రెస్ నాయకుడు అంతోటి పాల్, మాజీ జీఎం అందెల ఆనందరావు, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు తదితరులు కూడా సీఎండీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



ఇల్లెందు: అక్షింతలతో ఇంటింటికీ వెళ్తున్న భజనమందిర్ ఏరియా మహిళలు

సుజాతనగర్: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ అక్షింతల శోభాయాత్రను సుజాతనగర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో అక్షింతలకు పూజలు నిర్వహించిన అనంతరం వాటిని ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య రామాలయ విగ్రహ నమూనా, ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

పాల్వంచ: అయోధ్య శ్రీ సీతారాముల అక్షింతలు పట్టణంలోని భజన మందిర రామాలయం సేవాదళ్ ఆధ్వర్యంలో గడపగడపకు పంపిణీ చేసారు. ఇంటింటికి తిరిగి అక్షింతలు అందించి అయోధ్య రాముని విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్, చలవాది రాజ్యలక్ష్మీ, వంకదార ఇందిర, అయిత రూప్సీ, మానేపల్లి మంజుల, మౌనిక, కుసుమ, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: పట్టణంలోని నెంబర్–2 బస్తీ శ్రీ కృష్ణ భజన మందిరం ఏరియా మహిళలు స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికీ అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేశారు. గురువారం మహిళలు అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో ఆలయ ప్రారంభంతో పాటు శ్రీరామచంద్రమూర్తి ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు.



పాల్వంచ: అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం



సుజాతనగర్: అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు